# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంజాల దాసు

తెలంగాణ సోమవారం, 13 - జూలై - 2025 సంపుటి : 16 సంచిక : 351 పేజీలు 08 వెల : 6/-


# బోనమెత్తిన లష్కర్

- ఉజ్జయినీ మహంకాళి దర్శనానికి భారీగా భక్తజనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రి పొన్నం దంపతుల తొలి బోనం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ ప్రత్యేక పూజలు



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ : లష్కర్ బోనమెత్తింది. ఆదివారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా ముస్తాబు చేశారు. సికింద్రాబాద్ ప్రజలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేశారు. మహంకాళి అమ్మవారి దర్శనం కోసం ప్రజలు ఉదయం నుంచే క్యూలైన్‌లలో బారులు తీరారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళల బోనాలు, కోలాటాలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువతీ యువకుల నృత్యాల కోలాహలాలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. వేలాది మంది మహిళలు, భక్తులు, సందర్శకులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 11.40 గంటలకు ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, ఈవో గుత్త మనోహర్ రెడ్డి స్వాగతం పలికారు. సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ, శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు తదితరులున్నారు. అనంతరం అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. తెలంగాణ ప్రజలను చల్లగా చూడాలనీ, అందరూ బాగుండాలని అమ్మవారిని కోరుకున్నట్టు సీఎం తెలిపారు. ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో దేవాలయానికి రాగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, మొదటి బోనం సమర్పించారు. ఉదయం 4.10 గంటలకు పొన్నం దంపతులు మొదటి పూజ నిర్వ హించారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పొన్నం.. రాష్ట్రమంతా వర్షాలు,పడి, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు. అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారిని దర్శించుకు నేందుకు అవకాశం కల్పించారు.

### మహంకాళి అమ్మవారి దర్శనానికి పలువురు..

శ్రీఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, తలసాని శ్రీనివాస్

మిగతా 6లో..

# కోటకు.. కన్నీటి వీడ్కోలు



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ : పిసినారిగా, మధ్యతరగతి తండ్రిగా, అల్లరి తాతయ్యగా, అవినీతి నాయకుడిగా, కామెడీ విలన్‌గా, నవ్వించే పోలీస్‌గా, భయపెట్టే మాంత్రికుడిగా ఇలాంటి ఎన్నో పాత్రలకు తన నటనతో జీవం పోసిన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు (83) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారు జామున ఫిల్మ్‌నగర్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు.నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో భిన్న పాత్రలు పోషించి తెలుగువారి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. కోట శ్రీనివాసరావు 1942 జూలై 10న కృష్ణాజిల్లా కంకిపాడులో జన్మించారు. చిన్నప్పట్నుంచే నటన అంటే అమితాసక్తి. దీనికితోడు తన అన్నయ్యలు ఇద్దరూ కూడా నటన అంటే మక్కువ కలవారే కావడంతో రంగస్థలం వైపు నడిచేలా చేసింది. ఓ పక్క స్టేట్‌బ్యాంక్‌లో పనిచేస్తూనే మరో పక్క నాటకాల్లో నటించడం మొదలుపెట్టారు. దర్శకుడు కె.వాసు. ఆయన తెరకెక్కించిన 'ప్రాణం ఖరీదు' (1978)తోనే కోట తొలిసారి తెరపై తళుక్కు మన్నారు. ఇదే సినిమాతో చిరంజీవి కెరీర్ స్టార్ట్ కావడం విశేషం.అలాగే 'మామగారు' సినిమాలో పోతురాజుగా కోట ఆకట్టుకున్నారు. ఈ సినిమాతోనే బాబూ మోహన్, కోట కాంబినేషన్‌కి మంచి క్రేజ్ ఏర్పడింది. ఈ ఇద్దరి కాంబో దాదాపు 100 సినిమాల్లో నటించింది. 1999-2004 వరకు విజయవాడ తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యేగా చేశారు. ఆయన నటించిన చివరి చిత్రం 'హరి హర వీరమల్లు'. విలక్షణ పాత్రలకు, వైవిధ్యమైన సినిమాలకు కేరాఫ్‌గా నిలిచిన కోట తన నట జీవితంలో తొమ్మిది నంది పురస్కారాలను అందుకున్నారు. ప్రతిఘటన (1995), గాయం (1993), తీర్పు (1994), లిటిల్ సోల్జర్స్ (1996), గణేష్ (1998), చిన్న (2000), పృథ్వీనారాయణ (2002), ఆ నలుగురు (2004), పెళ్ళైన కొత్తలో (2006) చిత్రాలకు నంది అవార్డులను దక్కించు కున్నారు. అలాగే 2012లో 'కృష్ణం వందే జగద్గురుమ్' సినిమాకు సైమా అవార్డును అందుకు న్నారు. అరుదైన విలక్షణ నటుడిగా సినీ పరిశ్రమకు చేసిన సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం 2015లో ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారంతో సముచితంగా గౌరవించింది. 'ప్రతిఘటన'లో

మిగతా 7లో..

# నేటి నుంచి రేషన్ కార్డుల పంపిణీ

**తుంగతుర్తి బహిరంగ సభలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న సిఎం రేవంత్‌రెడ్డి**

**కొత్తగా 3,58,187 రేషన్ కార్డులు జారీ**

**ప్రభుత్వంపై నెలకు రూ.95.89 కోట్ల అదనపు భారం**

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ : పేదలకు ఆహార భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులను నిరంతరం అం దించే ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు కొత్త రేషన్ కార్డుల మం జూరుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో జరిగే బహిరంగ సభలో శ్రీకారం చుట్టనున్నారు. పౌర సరఫరాల మంత్రి ఉత్త మ్ కుమార్‌రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3,58,187 కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దీంతో అదనంగా 15,53,074 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనున్నది. మొదటి దశలో సిఎం రేవంత్ రెడ్డి 2,03,156 కొత్త కార్డులు మంజూరు కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లాలో ప్రారంభించిన విషయం తెలిసిందే. తుంగతుర్తి సభలో కొత్త రేషన్ కార్డుల జారీతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 89,95,282 నుంచి 95,56,625 కు చేరుకుంటుంది. లబ్ధిదారుల సంఖ్య 2,81,47,565 మంది నుంచి 3,09,30,911 మంది వరకు పెరుగుతుంది

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట



- ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు చేస్తాం
- ప్రజలకు అందుబాటులో అధికార యంత్రాంగం
- అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:- రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆబ్కారీ,మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కుమార్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి, కనీస వేతన సలహా మండలి బోర్డు చైర్మన్ బి జనక్ ప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి

మిగతా 4లో..

# తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి



**ఆయన వ్యాఖ్యలు క్షమించరానివి**

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను వెంటనే ఆ పదవి నుంచి సస్పెండ్ చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తనపై అనుచిత వాఖ్యలు చేశారని శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. విచక్షణాధికారాలు ఉపయోగించి ఆయన్ను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని ఆమె కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు క్షమించరానివని అన్నారు. "తెలంగాణలో మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఉంది. బోనం ఎత్తుకున్న ఆడబిడ్డను అమ్మవారిలా చూసే సంస్కృతి మనది. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో మహిళలు రాజకీయాల్లోకి వస్తూ ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు పరుషపదజాలంతో విమర్శలు చేస్తే వచ్చేవాళ్లు కూడా వెనక్కి తగ్గే పరిస్థితి ఉంటుంది. ఉచ్ఛరించలేని దారుణమైన వ్యాఖ్యలను మల్లన్న చేశారు. ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావద్దా? ఏదైనా ఉంటే అంశం ప్రాతిపదికన మాట్లాడాలి. ఏడాదిన్నరగా బీసీ సమస్యలపై తెలంగాణ జాగృతి తరఫున పోరాటం చేస్తున్నాం. ఏ రోజూ తీన్మార్ మల్లన్నను ఒక్క మాట అనలేదు. ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన జాగృతి కార్యకర్తలపై కాల్పులు జరుపుతారా? ఇది ప్రజాస్వామ్యం. దీనిలో అనేకమంది ప్రజల జీవితాలు ముడిపడి ఉన్నాయి. జాగృతి ఎన్నో కార్యక్రమాలు చేసింది.. అందులో బీసీ ఉద్యమం ఒకటి. బీసీ అయినంత మాత్రాన.. మల్లన్న ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. మల్లన్న చేసిన వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్‌ను ఫిర్యాదు చేస్తా" అని కవిత అన్నారు. నన్ను బయట తిరగనివ్వను అనటానికి ఆయన ఎవరని ప్రశ్నించారు. పరుష పదజాలాన్ని తెలంగాణ ప్రజలు క్షమించరని జరిగిన ఘటన స్పష్టం చేస్తున్నదని అన్నారు. తీర్మార్ మల్లన్నను అరెస్ట్ చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# జాగృతి వర్సెస్ తీన్మార్

- ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న అభ్యంతరకర వ్యాఖ్యలపై భగ్గుమన్న జాగృతి కార్యకర్తలు
- 'క్యూ' న్యూస్ ఆఫీస్‌పై దాడి, విధ్వంసం మల్లన్న పైనా దాడికి యత్నం
- అడ్డుకున్న గన్‌మెన్, గాల్లోకి కాల్పులు
- ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలు
- మేడిపల్లిలో ఉద్రిక్తత చిచ్చురేపిన బిసి రిజర్వేషన్ల అంశం



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ : ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి కార్యకర్తలు మేడిపల్లిలోని క్యూ న్యూస్ ఆఫీస్‌పై ఆదివారం దాడి చేశారు. ఉదయం 11.30 గంటలకు క్యూ న్యూస్ ఆఫీస్‌కు వచ్చిన 20మంది జాగృతి కార్యకర్తలు ఒక్కసారిగి లోపలికి దూసుకువచ్చి ఎమ్మెల్సీ నవీన్‌పై దాడి చేసేందుకు యత్నించారు. వెంటనే అప్రమత్తమైన గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరపడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. జాగృతి కార్యకర్తల దాడిలో క్యూ న్యూస్ సిబ్బందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న బిసి ఉద్యమంపై మార్నింగ్ న్యూస్‌లో తీన్మార్ మల్లన్న తప్పుపడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. మహిళా నాయకురాలిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ జాగృతి కార్యకర్తలు క్యూ న్యూస్ కార్యాలయానికి వచ్చి ఫర్నీచర్, సిబ్బందిపై దాడి చేశారు. ఈ సమయంలో తీన్మార్ మల్లన్న కార్యాలయంలో ఉండడంతో ఆయనపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. జాగృతి సభ్యులు బయటకి వెళ్లకపోతే కాల్పులు జరుపుతామని మల్లన్న గన్‌మెన్ హెచ్చరించాడు. అయినా కూడా జాగృతి కార్యకర్తలు క్యూ న్యూస్ కార్యాలయం నుంచి బయటికి వెళ్లకుండా అక్కడే ఉండి దాడి చేసేందుకు యత్నించారు. దీంతో అప్రమత్తమైన గన్‌మెన్ గాల్లోకి 5 రౌండ్ల కాల్పులు జరిపాడు. గన్‌మెన్ కాల్పుల్లో జాగృతి కార్యకర్త సాయి అనే యువకుడి చేతికి

మిగతా 6లో..

TIMES OF VARTHA (14-07-2025)_times of varha main (13-2).qxd 7/14/2025 6:01 AM Page 2



## దివ్యాంగులకు ఉపాధి పునరావాస పథకం

### జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

దివ్యాంగులు ఆర్థిక స్వాలంబన పొందడంతో సాదారణ జీవనం గడపడానికి వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవ, వ్యాపారములను స్థాపించుకొని జీవనోపాది పొందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దివ్యాంగులు ఉపాధి, పునరావాస పథకం అమలు చేస్తుందని జిల్లా మహిళా, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ పథకం క్రింద బ్యాంకు లింకేజి లేకుండా నేరుగా 50 వేల రూపాయలు, 2025-26 ఆర్థిక సంవత్సరమునకు 25 యూనిట్ల ద్వారా 50 వేల రూపాయలతో పాటు బ్యాంకు లింకేజి లోన్ 1 లక్ష రూపాయలు, 2లక్షల రూపాయలు, 3 లక్షల రూపాయల రుణాలు మొత్తం 28 యూనిట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. 2025-26 సంవత్సరమునకు లబ్దిదారుల ఎంపిక ఆన్లైన్ ద్వారా జరుగుతుందని, అర్హులైన దివ్యాంగులు ఈ పథకం కింద లబ్ది పొందడానికి ఆన్ లైన్ లో www.tgobmms.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా జూలై 14 నుండి జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు కనీస దివ్యంగత్వం 40 శాతం పైన ఉండాలని, 21 నుండి 55 సంవత్సరాల వయస్సు లోబడి ఉండాలని, ఆదాయ పరిమితి 1 లక్ష 50 వేల రూపాయలు గ్రామీణ ప్రాంతాలలో, 2 లక్షల రూపాయలు పట్టణ ప్రాంతాలలో ఉండాలని, గత 5 సంవత్సరాలలో ఈ పథకం కింద లబ్ది పొందకుండా ఉండాలని, కుటుంబాన్ని యూనిట్ గా తీసుకుంటారని, సాంకేతిక పరిపక్వత కలిగి ఉన్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు సమయంలో సదరం సర్టిఫికేట్, ఆదార్ కార్డు, ఇటీవల పొందిన ఆదాయ దృవీకరణ పత్రం, నివాస దృవీకరణ పత్రం, వయస్సు నిర్ధారణ పత్రం, కుల దృవీకరణ పత్రం, విద్యార్హతలు, పాస్ పోర్ట్ సైజు ఫోటో జత పరచవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయండి

### తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట జిల్లా ప్రతినిధి (పోతరాజు వెంకన్న)



నూతనకల్ మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గొప్ప ప్రారంభం అవుతుంది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం అనేక సంక్షేమ పథకాల ప్రారంభించారని అన్నారు. అంతేకాకుండా రైతులు కు ఏక కాలంలో రుణమాఫీ, రైతు భరోసా నిధులు విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆహార భద్రత కల్పించే దిశగా, ప్రజా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందనీ దశాబ్దకాలంగా నిలిచిపోయిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను మళ్లీ పునః ప్రారంభించి, అర్హులైన లబ్ధిదారులందరికీ నూతన రేషన్ కార్డులు అందజేసేందుకు ఈ నెల జూలై 14న తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల కేంద్రంలో జరిగే బహిరంగ సభ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు, చేతుల మీదుగా స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్, ఎంపీ చామల కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారు. ఈ బహిరంగ సభకు ప్రజలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మహిళ నాయకురాలు బత్తుల సరితకు డాక్టరేట్



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణానికి చెందిన మహిళ నాయకురాలు బత్తుల సరితకు సామాజిక సేవా రంగాల్లో ఆమె చేసిన కృషికి గాను ఆమెను డాక్టరేట్ తో సత్కరించారు. ఆదివారం వరంగల్ పట్టణంలోని రామయ్య ఫంక్షన్ హాల్ లో తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సరిత కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి, ఘనంగా సన్మానించారు. డాక్టరేట్ పురస్కారం గ్రహీత బత్తుల సరిత మాట్లాడుతూ, తాను చేసిన చేసినటువంటి సేవలను గుర్తించి, డాక్టరేట్ అందజే యడంతో పాటు ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాచారం గౌరీ శంకర్, సభ్యుడు బట్టు శ్రీనివాస్ లు ఆధ్వర్యంలో అవార్డు అందుకోవడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సరిత ను పలువురు అభినందించారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

### టిఎన్జీవో ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులకు విన్నపం

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-




రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు, ఐటి, ఎన్విరాన్మెంటల్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లను జిల్లా టీఎన్జీవో నేతలు కోరారు. ఆదివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన వారిని లక్షెట్టిపేట్ లో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, టిఎన్జీవో నేతలు రాష్ట్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్ప గుచ్ఛం అందించి, మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాద్యాయుల సమస్యలను రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తొందర్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్, రాం కుమార్, నరేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్, మంచిర్యాల అధ్యక్షుడు నాగుల గోపాల్, లక్షెట్టిపేట్ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

- పేద వాడి కలలను నిజం చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ముఖ్యమంత్రి చేతుల మీదుగా నూతన రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం
- భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - ప్రత్యేక ప్రతినిధి

సుదీర్ఘకాలంగా తెలంగాణ రాష్ట్ర పేద కుటుంబాలు ఎదురు చూస్తున్న నూతన రేషన్ కార్డుల పంపిణీ ఈ కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నదని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమల గిరిలో సోమవారం నిర్వహించనున్న సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మం దుల సామేల్, సూర్యాపేట డిసిసి అధ్యక్షుడు సిహెచ్ వెంకన్న నల్లగొండ జిల్లా డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కొత్తగూడెం భద్రాచలం జిల్లా కాంగ్రెస్ అబ్జర్వర్ పోత్నాక్ ప్రమోద్ కుమార్లతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు లేక గత పది సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న పేదలు కన్నా కలలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజం చేసేందుకు తుంగతుర్తిలో సోమవారం ఘనాంగా నిర్వహించ నున్న బహిరంగ సభలో పాల్గొనేందుకు రానున్నారని పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేదవాడి కలలను నిజం చేసేందుకు తమ ప్రభుత్వం అండగా నిలువబోన్నదని చామల వివరించారు. తమ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకటి ఒకటిగా నిజం చేస్తుందని శ్యామల తెలిపారు. అందులో భాగంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం తిరుమలగిరి ప్రజా వేదిక బహిరంగ సభ ద్వారా శ్రీకారం చుట్టం ఉన్నదని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం పేదల పక్షాన ఉంటూ వారి సంక్షేమ సంబరాన్నీ శ్రీకరం చుట్టేందుకు విచ్చేయనున్న ముఖ్యమంత్రి వర్యులు ఆనుముల రేవంత్ రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికేందుకు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుమలగిరి బహిరంగ సభ వేదిక ద్వారా తెలంగాణ చరిత్రలోనే నిర్వహించబడే ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ప్రతి ఒక్కరు తిలకించేందుకు తరలిరావాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆదర్శ నియోజకవర్గంగా చెన్నూరును తీర్చిదిద్దుతాను

- రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి
- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



చెన్నూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, రాష్ట్రంలోనే ఆదర్శం నియోజకవర్గంగా చెన్నూరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా నని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, మైనింగ్ శాఖ మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని 23వ వార్డు బురుదగూడెం లో ఆదివారం ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించి, వార్డులో నెలకొన్న సమస్యలు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పట్టణంలో వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, పారిశుద్ధ్యం మెరుగు పరచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బురదగూడెం వాసులు వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి దృష్టి కి తీసుకురాగా అధికారుల తీరు పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాలనీలో సమస్యలు వెంటనే పరిష్కరించి, మౌళిక వసతులు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున రోడ్లు, డ్రైనేజీలు, కాలనీలలో పరిశుభ్రత పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు పనులను సకాలంలో పూర్తి చేయాలని లేకుంటే సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని బొక్కల గుట్ట లోని గాంధారి ఖిల్లాలో మైసమ్మ తల్లిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఆదివాసి, గిరిజన సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

# అత్యాశ వద్దు...అప్రమత్తంగా ఉండాలి

### పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



అత్యాశ, అవగాహన లేకపోవడం వలనే సైబర్ నేరాలు పెరుగుతున్నాయని పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు స్వీయ అప్రమత్తత, అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమన్నారు. ప్రజలు డిజిటల్ అరెస్ట్ అనగానే భయపడవద్దని, అలాంటి కాల్స్ వస్తే నిర్భయంగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా యువత ఆన్లైన్ బెట్టింగ్ యాప్ల జోలికి వెళ్ళ వద్దన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటిని క్లిక్ చేసి మోసపోవద్దని సూచించారు. ఈ మధ్య కాలంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు నకిలీ పిఎం కిసాన్, ఎస్బిఐ రివార్డ్ వంటి పేర్లతో ఏపీకే ఫైల్స్ ను వాట్సాప్, టెలిగ్రామ్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాలతో పంపిస్తున్నారని, పొరపాటున ఇలాంటి లింక్స్ ను క్లిక్ చేసి, అప్లికేషన్ ఇన్స్టాల్ చేస్తే మీ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీనితో మీ ఫోన్లోని ఓటిపి లు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్తాయన్నారు. ఆ తర్వాత నేరగాళ్లు బాధితుడి వాట్సాప్ ఖాతాను హైజాక్ చేసి, అదే నకిలీ లింక్ను అతని కాంటాక్ట్స్లో ఉన్న వారందరికీ ఆటోమేటిక్గా పంపిస్తారని వివరించారు. ఈ మోసాలతో బాధితులు తీవ్రమైన ఆర్థిక నష్టాలకు, వ్యక్తిగత డేటా చోరీకి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నకిలీ ఏపికే ఫైల్స్ మోసాల బారిన పడకుండా ఉండాలంటే ప్రజలు వాట్సాప్లో వచ్చే అనుమానాస్పద లింక్లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయరాదని సూచించారు. పిఎం కిసాన్ యోజన, ఎస్బిఐ రివార్డ్స్ పేరుతో ఏపికే ఫైల్స్ లింకులు వస్తే వాటిని వెంటనే డిలీట్ చేయాలన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు లేదా ఓటీపీ లను ఎవరితోనూ షేర్ చేయవద్దని సూచించారు. ప్రభుత్వ సంస్థలు గానీ, బ్యాంకులు గానీ ఇటువంటి సున్నితమైన సమాచారాన్ని ఫోన్ల ద్వారా ఎన్నడూ అడగవని స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్ నేరాల పట్ల ప్రజలు ఎంత అవగాహన కలిగి ఉంటే, వాటిని అంత సమర్థవంతంగా తగ్గించవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

## జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్ష కార్యదర్శులుగా నారాయణ, గంగ ప్రసాద్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

అఖిల భారతీయ పద్మశాలి సంఘం సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్, జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి నర్సింలు బలపరిచిన జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఖలీల్ వాడి లోని జిల్లా సంఘ భవనంలో ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా మైసల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు గంగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా గాలిపల్లి నారాయణ, పాము రమేష్, అంకం జగదీష్ గంగుల దత్తాద్రి (ముప్కాల్), ఆరుట్ల రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శిగా దేవ బజరంగ్, పద్మ సుభాష్, సాంబారు తిరుపతి (నందిపేట), ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పరపల్లి నాగరాజు, ప్రచార కార్యదర్శిగా కూరపాటి వెంకట్, కోశాధికారిగా దిండిగళ్ళ శంకర్ లను నియమించారు. సలహాదారులుగా డాక్టర్ ఎం. శ్రీహరి, డాక్టర్ కె. సుభాష్, డాక్టర్ బి. కేశవులు, పెంట దత్తాద్రి, గెంట్యాల వెంకటేశం, భీమర్తి రవి, కన్నా శ్రీనివాస్, ఉప్పరపల్లి శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గర్దాస్ శంకర్, ఆడెపు రాజన్న, విట్టం వెంకటరమణ (నూత్ పల్లి), జట్ల బాలరాజ్ (ఎడపల్లి ), గంజి గణేష్ (నవీపేట్ ), షేర్ పల్లి బాబురావు, గంగుల గంగాదర్ (నంది పేట ), దయానంద్ (హెున్నజిపేట్ ) లను ప్రకటించారు.





## ఊర పండుగ శోభయాత్ర బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ క్రైమ్



ఆదివారం నిజామాబాద్ పట్టణంలో నిర్వహించిన ఊర పండుగ శోభయాత్రను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పర్యవేక్షించారు. ఊర పండుగ శోభయాత్ర రఘునాథ ఆలయం ఖిల్లా చౌరస్తా నుంచి ప్రారంభమై వివేకానంద చౌరస్తా, లక్ష్మీ మెడికల్, గాజుల్పేట్, పెద్ద బజార్, గోల్ హనుమాన్, పులాంగ్ చౌరస్తా, ఆర్య నగర్, వినాయక నగర్, దుబ్బ తదితర ప్రాంతాలలో బందోబస్తు ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నిజామాబాద్ ప్రజలందరికీ ఊర పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఊర పండగ శోభాయాత్ర ప్రారంభం నుంచి చివరి వరకు పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా సరి తీసుకుని వెళ్ళే ప్రత్యేక ప్రాంతాలలో చుట్టుముట్టు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని, రూట్ మ్యాప్ ప్రకారంగా శోభయాత్ర నిర్వాహకులు, ప్రజలు పోలీస్ బందోబస్తుకు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సిఐలు, ఎస్సైలు, బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

since 2007
# టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com

జనరల్ న్యూస్
GENERAL NEWS

సోమవారం,
14-07-2025

3

# 15న టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో బోనాల పండుగ

**అందరికీ ఆహ్వానం పలికిన జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుమన్ కుమార్**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఈనెల 15న బోనాల పండుగ నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, డిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా టిఎన్జీవో జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘ నాయకులకు, అధికారులకు, ఉద్యోగులకు మహిళా ఉద్యోగ సోదరీమణులకు, జిల్లా ప్రజలందరికీ ఊర పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ టీఎన్జీవో ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగా ఆషాడ బోనాల ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పాత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ నవదుర్గ మాత ఆలయ ప్రాంగణంలో బోనాల ఉత్సవాలు ఈ నెల 15న మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగ సోదరిమణులు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, టీఎన్జీవో అన్ని యూనిట్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, క్లాస్ ఫోర్, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యవర్గ బృందం, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యవర్గ బృందం, జిల్లా ప్రజలు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై బోనాల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనా న్నారు. తదనంతరం ఏర్పాటు చేసిన మహా అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని ఆ జగదాంబ మాతా కృపకు పాత్రులై, టీఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్, జిల్లా సహాధ్యక్షుడు చిట్టి నారాయణ రెడ్డి, టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి దినేష్ బాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి జాఫర్ హుస్సేన్, నిజామాబాద్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.




# బాపూనగర్‌లో ఘనంగా బోనాలు...



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండలం బాపూనగర్ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత నియమనిష్టలతో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామస్తులు డప్పువాయిద్యాలతో పోచమ్మ గుడి వద్దకు వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలు తమ గ్రామాన్ని సుభిక్షంగా ఉంచాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. గ్రామంలో గ్రామస్తులు ఆయురారోగ్యాలతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ప్రతి ఏటా తమ గ్రామంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంజిత్, కిరణ్, రాము, రాజ్ కుమార్ స్వామి, కిషోర్, ప్రవీణ్, రమేష్, నర్సింలు, శేఖర్, వెంకటి, శివ, సంజీవ్ కుమార్, రాజశేఖర్, స్వామి, పోచయ్య, లింగం, సింహాద్రి, మూర్తి, గ్రామస్తులు, గ్రామపెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫోటో భవన్ వార్షికోత్సవ వేడుకలు



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణ ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఫోటో భవన్ రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ఫోటో భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పసుల వెంకటస్వామి అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిటపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి, సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య గౌడ్, పట్టణ కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు లక్కిరెడ్డి అనిదర్ రెడ్డి, ఆర్ సుజిత్, నక్క పవన్, తాళ్లపల్లి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వలస మణిరాజ్, ప్రచార కార్యదర్శులు పసుల రవి, రామసాని సురేందర్, కేశవేణి హరికృష్ణ, జూపాక సది, సలహాదారులు నక్క తిరుపతి, సత్యనారాయణ, జాడి ముకుంద, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్వాస తిరుపతి, కుటుంబ భరోసా ఇన్చార్జి నూనె సురేష్, అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద యువకుని దాడి...

**మరమ్మతులపై ఆగ్రహంతో యువకుడి వీరంగం....**

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి





మెరుగైన విద్యుత్ సరఫరా కోసం నిర్వహించిన నెలవారీ మరమ్మతుల సమయంలో ఎడపల్లి మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామానికి చెందిన ఓ యువకుడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వీరంగం సృష్టించాడు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బందిపై దాడికి పాల్పడడంతో విద్యుత్ సిబ్బంది ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ వివరాల ప్రకారం, ప్రతీ నెల రెండవ శనివారం నిర్వహించే మరమ్మతుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మంగళ్పహాడ్ సబ్ స్టేషన్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మరమ్మతు పనులు జరుగుతుండగా, మంగళ్‌పహాడ్ గ్రామానికి చెందిన బండారి అఖిల్ అనే యువకుడు సబ్ స్టేషన్‌కు వచ్చి హల్చల్ చేశాడు. విద్యుత్ సరఫరా ఎందుకు నిలిపివేశారని ప్రశ్నిస్తూ సబ్ స్టేషన్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. సాయంత్రం ఐదున్నర అవుతున్నా విద్యుత్ సరఫరా ఎందుకు ఇవ్వడం లేదని సిబ్బందిని దుర్భాషలాడుతూ నానా హంగామా సృష్టించాడు. మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతున్నాయని సిబ్బంది చెబుతున్నా వినకుండా, అక్కడ పనిచేస్తున్న వారిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన విద్యుత్ సిబ్బంది ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లైన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది మాట్లాడుతూ... ప్రతీ నెల రెండవ శనివారం మెరుగైన నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మత్తులు కొనసాగుతాయని తెలిపారు. అందులో భాగంగానే శనివారం మరమ్మత్తులు జరుగుతుండగా అఖిల్ అనే యువకుడు దాడికి పాల్పడ్డాడని చెప్పారు. విధులకు ఆటంకం కలిగించి, దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాన్స్ జెండర్లకు ఉపాధి పునరావాస పథకం

**జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

జిల్లాలోని నిరుద్యోగులైన ట్రాన్స్ జెండర్లకు ఉపాధి పునరావాస పథకం అమలు చేయడం జరుగుతుందని జిల్లా మహిళా, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇందు కొరకు అర్హులైన ట్రాన్స్ జెండర్ ల నుండి ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణలో భాగంగా డ్రైవింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, బ్యూటీషియన్, జ్యూట్బ్యాగ్ టైలరింగ్, లాజిస్టిక్ రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి, అర్హత గల ట్రాన్స్ జెండర్లు www.wdsc.telangana.gov.in వెబ్ సైట్లో జూలై 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040- 24559050 నంబర్ లో సంప్రదించాలని తెలిపారు.

# కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సముచిత న్యాయం

**సొసైటీ చైర్మన్ బూరోళ్ల అశోక్**

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేశన్ల పై రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడంతో, మాక్లూర్ కేంద్రం శుభాష్ కూడలిలో తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , నిజామాబాద్ ఇంచార్జ్ మంత్రి సీతక్క, ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు, మాక్లూర్ మండల కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి, స్వీట్లుపంచుకుని సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముఖ్యనాయకులు, మాక్లూర్ వ్యవసాయసహాకార సంఘం అధ్యక్షులు బూరోళ్ల అశోక్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం తోపాటు దేశంలో అన్నివర్గాలకు, కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అన్ని రంగాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎందరో ముఖ్యమంత్రులు పాలించారని, ఇప్పడివరకు బీసీలను గుర్తించలేరని, స్థానిక ఎన్నికల్లో బీసీలం ఏకతాటిగా ఉండి, ముఖ్యమంత్రికి గెలుపు కానుగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఈయనతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవిప్రకాష్, నిజామాబాద్ మార్కెట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు. మండల యువజన నాయకులు వినోద్, రాజీవ్ గాంధీ పంచాయత్ అధ్యక్షులు గంగాధర్ గౌడ్, సిసైటీ ఉపాధ్యక్షులు శేఖర్, డైరెక్టలు, మాజీ చైర్మెన్ దయాకర్‌రావు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కల్దుర్కిలో ఘనంగా బోనాల పండుగ

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్



మండలంలోని కల్దుర్కి గ్రామంలో బోనాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, పిల్లలు సాంప్రదాయ వస్త్రాలను ధరించి బోనాలను ఎత్తుకొని గ్రామ దేవతల ఆలయాలకు వచ్చారు. డప్పు చప్పుళ్ళ మధ్య తరలి వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పిం చారు. గ్రామంలోని పాడి, పంటలు సంవృద్ధిగా పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ..ప్రతి ఆషాఢ మాసంలో బోనాల పండగ ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటి చైర్మన్ బంటు గంగాధర్, వైస్ చైర్మన్ తుడం బాబు, మాజీ ఉపసర్పంచ్ న్యాలం శ్రీనివాస్ , గ్రామ పెద్దలు రామ్ జీ, మొగులయ్య, దమ్ము రెడ్డి, అశోక్, శంకర్ గౌడ్, లక్ష్మణ్ అన్ని కుల సంఘాల పెద్ద మనుషులు, గ్రామ ప్రజలు , మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# డాక్టర్ యోగిరాజ్ వైద్యకు స్వర్ణ కంకణ పురస్కారం

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వరంగల్ లోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన జాతీయ పురస్కార సన్మాన సభ లో బోధన్ కు చెందిన డాక్టర్ యోగిరాజ్ వైద్యకు స్వర్ణ కంకణ పురస్కారం అందజేశారు. జ్యోతిష్య శాస్త్రంలో యోగి రాజ్ వైద్య చేస్తున్న విశేష కృషిలో భాగంగా తెలుగు సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్వర్ణకంకణంతో సన్మానించారు. ఈ పురస్కారాన్ని అందుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు.



# నిజామాబాద్‌లో ఘనంగా ఊర పండుగ

**ముఖ్యఅతిథిగా హాజరైన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా**



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కల్చరల్



నిజామాబాద్ నగరంలో ఊర పండుగ ఘనంగా జరిగింది. సర్వ సమాజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఊర పండుగ అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు ఖిల్లా నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 90 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఇందూర్ ఊర పండు గకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. గతంలో ప్రజలు గత్తర, మచూచి వంటి వ్యాధులతో బాధపడినప్పుడు అమ్మవార్లను శాంతింప జేయడానికి ఈ ఊర పండుగ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని అన్నారు. అంతేకాకుండా ఇది కులాల మధ్య తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా నిర్వహించడం హిందువుల ఐక్యతకు నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఐక్యమత్యాన్ని కొనసాగిస్తూ హిందువులందరు మన పండుగలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఆషాడ మాసంలో వచ్చే ఈ పండుగ రైతులకు అనుకూల వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండేల అమ్మ ఆశీర్వాదం ఇందూర్ ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

# ఎడపల్లి అల్ ఇండియా బంజారా సేవ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో అల్ ఇండియా బంజారా సేవ సంఘం నూతన మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. వడ్డేపల్లి గ్రామంలోని జగదాంబ మాత సేవాలాల్ మహరాజ్ ఆలయంలో జరిగిన ఈ ఎన్నికలను జిల్లా పర్యవేక్షకుడు తారాచంద్మరియు, మండల ఎన్నికల అధికారి మున్ని నాయక్ పర్యవేక్షించారు. ఈఎన్నికల్లో మండల గౌరవ అధ్యక్షునిగా భీమ్లా నాయక్, అధ్యక్షుడిగా మేఘవత్ గంగాధర్, సెక్రటరీగా పి. శ్రీనివాస్, కోశాధికారిగా పి. గణేష్, ఉపాధ్యక్షులుగా ఇంద్రవత్ బాలు, మరియు మేఘవత్ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మండల ఎన్నికల అధికారి ముని నాయక్, ఎడపల్లి మండలంలోని వివిధ గ్రామాల బంజారా సభ్యులతో విస్తృతంగా సంప్రదించిన తర్వాతే ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. బంజారా సోదరుల మధ్య ఐక్యతను పెంపొందించడం, వారి అభివృద్ధికి కృషి చేయడమే ఈ నూతన కమిటీ ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మేఘవత్ గంగాధర్ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని, జిల్లా కమిటీతో పాటు తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కమిటీ బంజారా సమాజ అభ్యున్నతికి గణనీయమైన కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
సోమవారం,
14-07-2025
4

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)..

అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, నవీకరణ కార్యక్రమాలను చేపట్టిందని, ఇందులో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలో 8 కోట్ల 50 లక్షల రూపాయల ప్రభుత్వ నిధి, 1 కోటి రూపాయల సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం కొరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో 10 కోట్ల 20 లక్షల రూపాయల సిఎస్ఆర్, డిఎంఎఫ్టి నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచి, నూతన మెనూ ఖచ్చితంగా అమలు చేస్తూ, విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల నియామకంతో అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చేయూతనిస్తూ దండేపల్లి మండలం అందుగులపేట (వెల్గనూర్) గ్రామంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, 90 శాతం బ్యాంకు రుణం, 10 శాతం గ్రామ సంఘాల వాటాతో రోజుకు సుమారు 4 వేల 500 నుండి 5 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరిగి, సంవత్సరానికి దాదాపు 51 లక్షల రూపాయల రాబడి వస్తుందన్నారు. నర్సింగాపూర్ గ్రామంలో 1 కోటి 63 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో 2/200 కిమీ నుండి 3/100 కిమీ కొరకు 900 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను ప్రారంభించడం జరిగిందని, ప్రారంభించిన అతి తక్కువ కాలంలో విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయిందన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో



ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరుతున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థిక చేయూతను అందించేందుకు ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కొరకు హాజీపూర్ మండలం వేంపల్లి లో భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయబడి పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడంతో జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులో 212 ఎకరాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఇండస్ట్రియల్ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు కొరకు భూమి పూజ నిర్వహించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో రాబోయే రోజులలో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని, పెద్ద మొత్తంలో పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని తెలిపారు. అటవీ శాఖ సంబంధించిన నూతన వాహనాలను ప్రారంభించి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎడపల్లిలో పలు గ్రామాలలో వనభోజనాల సందడి...

టైమ్స్ ఆఫ్ వార్త – ఎడపల్లి

ఎడపల్లి మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు ఆదివారం వనభోజనాలకు వెళ్లారు. ఈమేరకు బాపునగర్, పోచారం, జన్కంపేట్, జైతపూర్, ఠానాకలాన్, జమ్లం గ్రామాలతో పాటు పలు గ్రామాలలో జనాలు కుటుంబ సమేతంగా గ్రామ శివారులోని గుట్ట ప్రాంతాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో సంపక్తి భోజనాలు చేశారు. వర్షాకాలం ప్రారంభం కాగానే పస్కారాజులకు నైవేద్యాలు సమర్పించి వనాలలో భోజనాలు చేయడం ఆన వాయితీగా వస్తుంది. జనాలు గ్రామ పొలిమేర్లో పచ్చిక బయలుమధ్య గడిపేందుకు తమ కుటుంబ సభ్యుల మధ్య పెద్ద ఎత్తున వన భోజనాలకు వెళ్లారు. ఈసందర్భంగా ఉదయం నుండి వనభోజనాల వెళ్లే ప్రజలతో గ్రామాల శివార్లు కొత్త కళ సంతరించుకుంది. కుటుంబ సభ్యులతో ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ చాలా సంతోషంగా గడిపారు.

# సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఊర పండుగ

టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ కల్చరల్



సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. సర్వ సమాజ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ ఆదే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఊర పండుగ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వ సమాజ్ అధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికారప్రతి నిది స్వామి యాదవ్, మాజి నగర అధ్యక్షుడు ఎండల సుధాకర్, బిజెపి నాయకులు ఆది నరేందర్, శ్రీనివాస్ శర్మ, నారాయణ యాదవ్ రవి కుమార్, పటేల్ ప్రసాద్, చైతన్య కులకర్ణి, మల్లేష్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలి

## లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ పి. లక్ష్మి

టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ



లయనిజంలోకి కొత్త వారిని తీసుకురావడం ద్వారా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పి. లక్ష్మి ఉద్బోధించారు. లయన్ సభ్యులు నూతన సభ్యత్వంపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. లయన్స్ ఇంటర్నేషనల్ నిజామాబాదు రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారుల సమావేశం నిజామాబాదు నగరంలోని సందీప్ గార్డెన్స్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పి. లక్ష్మి ముఖ్యాతిధిగా హాజరయ్యారు. నిజామాబాదు రీజియన్ చైర్మెన్ ఉదయ సూర్యభగవాన్ సంపాదకత్వంలో ముద్రించిన లయన్స్ సమాచార దర్శిని మాస పత్రికను పూర్వ గవర్నర్ లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల ఒకటిన శుభారంభ్ పేరిట నిజామాబాదు రీజియన్ పరిధిలో ఒకే రోజు 85 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల సమాచారం కోసం నెలవారీ సమాచార దర్శినిని ముద్రించడం గొప్ప విషయమని అన్నారు. మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించేందుకు లయన్స్ జిల్లా యాంటీ డ్రగ్స్ చైర్మెన్ జిల్కర్ విజయానంద్ రూపొందించిన స్టిక్కర్లు, బ్యానర్లు, బ్యాడ్జీలను ఈ సందర్భంగా లక్ష్మి ఆవిష్కరించారు. లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్లు డి. పెంటయ్య, ఇరుకుల వీరేశం, జిల్లా అదనపు కోశాధికారి పి. లక్ష్మినారాయణ, రీజియన్ చైర్మెన్ ఉదయ సూర్యభగవాన్, రీజియన్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, రీజియన్ పీఆర్వో చింతల గంగాదాస్, జోన్ చైర్మెన్లు దారం భూమన్న, కాలేరు అవన్ కుమార్, బొబ్బ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

## బీజేవైఎం అధ్యక్షుల ద్వారా లబ్ధిదారులకు అందజేత

టైమ్స్ ఆఫ్ వార్త – మాక్లూర్



మాక్లూర్ మండలంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బిజెవైయం మండల అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్ సోమవారం అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సూచనల మేరకు ఈ చెక్కుల పంపిణీ జరిగింది. వేణు కిషన్ నగర్ తండాకు చెందిన లబ్ధిదారులు ఇటీవల హాస్పిటల్‌లో చికిత్స పొందారు. తర్వాత వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా, ఎమ్మెల్యే సహకారంతో వారి సమస్య పరిష్కారమైంది. ఈ క్రమంలో తేజవత్ బులిబాయ్‌కు రూ. 48,000, కెలుత్ హరియాలకు రూ. 60,000 చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బీజేవైఎం అధ్యక్షుడు లబ్ధిదారులకు స్వయంగా అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఉద్యోగ మేళాను నిరుద్యోగులందరు సద్వినియోగం చేసుకోవాలి

## టీపీసీసీ అధికార ప్రతినిధి, ఎస్ ఈ ఏ జాతీయ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి




సనాతన ఎంట్రప్రెన్యూర్ అసోసియేషన్ (ఎస్ఈఏ) ఆధ్వర్యంలో యువజన విభాగం వారు ' యువ ధ్వని 2025 ఉద్యోగ మేళా ' హైటెక్ సిటీ లోని సైబర్ గార్డెన్స్ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధికార ప్రతినిధి, శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్, ఎస్ఈఏ జాతీయ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం హాజరయ్యారు. 40 కంపనీల ప్రతినిధులు స్టాల్స్ ను ఏర్పాటు చేసారు. ఈ ఉద్యోగ మేళాకు దాదాపు 1500 మంది నిరుద్యోగులు హాజరైనారు, అన్ని స్టాల్స్ ను పరిశీలించి వివిధ కంపనీల ప్రతినిధులతో మాట్లాడి, ప్రోత్సహించి కొంతమందికి ఉద్యోగాలలో అవకాశం వచ్చినవారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీ వ్యవస్థాపకులు ముళ్లపూడి అమ్రిత్, యువజ న విభాగంప్రధాన కార్యదర్శి గౌతమ్ వలివేటి, యువ ధ్వని ప్రతినిధులు శ్రీమతి యామిని కాళీమాత, చంద్ర కాళీమాత, పవన్ తివారి, సత్య రాయప్రోలు, చంద్ర మౌళి, ప్రసన్న హరి, శరన్ కందాల, సీ, సభ్యులు, యువజన విభాగం, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడే సీఎం చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ

## ప్రతి పేదవారికి ఆహార భద్రతే లక్ష్యంగా కాంగ్రెస్ సంకల్పం

## జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు

టైమ్స్ ఆఫ్ వార్త – సూర్యాపేట జిల్లా ప్రతినిధి (పోతరాజు వెంకన్న)



పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. నిలిచిపోయిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను పునఃప్రారంభిస్తూ, ఈ నెల 14వ తేదీన తిరుమలగిరిలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుడుతున్నారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అధ్యక్షత వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే సభలో కొత్త రేషన్ కార్డులు అర్హులైన లబ్ధిదారులకు అందించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు మాట్లాడుతూ "కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడం. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చూడడమే ప్రభుత్వ సంకల్పం" అన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ, సేవాదళ్ తదితర అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# జన్మదిన వేడుకలకు బండి రమేష్ దూరం...

## సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన,

## కల్తీ కల్లు భాదితులకు సానుభూతి.. బండి రమేష్

టైమ్స్ ఆఫ్ వార్త– కూకట్ పల్లి



పటాన్ చెరువు పఠాన్ చెరువు పారిశ్రామిక వాడ, హైదర్ నగర్ కల్తీ కల్లు మృతులకు ఆత్మశాంతి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసిన బండి రమేష్. సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనలో, హైదర్ నగర్ లో కల్లు తాగి మృతి చెందిన బాధితులకు సంతాపసూచకంగా ఈసారి తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు టిపిసిసి ఉపాధ్యక్షుడు జహీరాబాద్ పార్లమెంటు, కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ (మంగళవారం) తాను జన్మదిన వేడుకలు జరుపుకోవడం లేదని బండి రమేష్ ప్రకటించారు ఇటీవల ఐ డి ఏ పాశమైలారం పారిశ్రామిక వాడలో సిగాచి పరిశ్రమలో భారీ రియాక్టర్ పేలిన సందర్భంగా జరిగిన పేలుడు ఘటనలో 52మంది, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్ నగర్ లో కల్తీ కల్లు తాగి 9 మంది మరణించిన నేపథ్యంలో తన జన్మదిన వేడుకలు జరుపుకోవడం లేదన్నారు. ఆయా మృతులకు కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు బండి రమేష్ తెలిపారు.

# బీసీ లకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు

టైమ్స్ ఆఫ్ వార్త –కూకట్ పల్లి



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షులు భాషా ధన్యవాదాలు తెలియజేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి పెద్దపీట వేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీకి ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. అలాగే రాబోయే ఎన్నికలలో దూదేకుల ను గుర్తించి అర్హులు అయినా వారికి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ దూదేకుల కులస్తులకు అన్ని రకాలుగా ఆదుకోవాలని మేడ్చల్ జిల్లా మైనారిటీ ప్రజల తరుపున కోరుతున్నామని ఒక ప్రకటన తెలిపారు..

# చనిపోయిన కుటుంబాని పరమర్శించిన కన్నెబోయిన

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని



చింతకాని మండలం చిన్నమండవ గ్రామానికి చెందిన కాసిమాల వెంకటి సుభద్ర ఇద్దరు కుమారులు నాగగోపి, నంద కిషోర్ గత వారం క్రితం మున్నేరులో పడి చనిపోయిన కుటుంబాని పరమర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కన్నెబోయిన సీతారామయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుండ్ల రాంబాబు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో వివిధ సంఘాల బీసీ నాయకులు కలిసి చేసిన పోరాట ఫలితమే అని కోనిగాడుతూ సంబంధిత చట్ట సవరణకు ఆర్డినెన్స్ జారీ చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెల్ల హరికృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు..

# కల్తీ కల్లు బాధిత కుటుంబాలను పరామర్శించిన సీపీఎం నేతలు

## సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్...

టైమ్స్ ఆఫ్ వార్త–కూకట్‌పల్లి



కూకట్‌పల్లి సమీపంలోని హైదర్ నగర్ శంషిగూడలో కల్తీకల్లు తాగిన ఘటనలపై సీపీఎం మేడ్చల్ జిల్లా నాయకులు స్పందించారు. ఇప్పటి వరకు తొమ్మిది మంది మరణించగా, పలువురు బాధితులు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలపై సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్, కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ కల్తీకల్లు తాగి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదింటిలో విషాదమే. బాధితులకు ప్రభుత్వ సహాయం అత్యవసరం. ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందుతున్న వారికి ఉచితంగా నాణ్యమైన వైద్యం కల్పించాలి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి" అని అన్నారు.



## సీపీఎం పార్టీ ప్రధాన డిమాండ్లు ఇవే:

కల్తీకల్లు తాగిన బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం, మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం, కల్లు అమ్మిన మూడు కంఫౌండ్ల యజమానులపై హత్యా నేరం కింద కేసులు నమోదు, తప్పిదం చేసిన మద్యపాన నియంత్రణ శాఖ అధికారులపై కఠిన చర్యలు కల్తీకల్లు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు, ప్రతి రోజు రెండుసార్లు తనిఖీలు నిర్వహించాలి

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
సోమవారం, 14-07-2025



# ఎన్నికల హామీలను నెరవేర్చాలి

**పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్**

**రేవంత్ సర్కారు కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తోంది**



టైమ్స్ ఆఫ్ వార్త - జాజిరెడ్డిగూడెం

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. "420 హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి వాటిలో ఒక్కదానిని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. కేసీఆర్ దారిలోనే నడుస్తున్నారు. విద్యా భరోసా కార్డు, వడ్డీరహిత విద్యార్థి రుణాలు, లాప్‌టాప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు జోక్యం లేకుండా మరిచిపోయారు. 7200 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలను ఇప్పటికీ విడుదల చేయలేదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం విద్యా విభాగానికి కేటాయిస్తామని చెప్పి మొండిగా వ్యవహరిస్తున్నారని, ఇది పేద విద్యార్థులకు విఘాతం అని విమర్శించారు. రైతులూ, మహిళలూ, నిరుద్యోగులూ మోసపోతున్నారు. రైతులకు ఇచ్చిన రూ.15,000 రైతు భరోసా, కౌలుదారులకు రూ.15,000, రుణ మాఫీ, ఉపాధి కూలీలకు రూ.12,000, మహిళలకు రూ.2,500, పింఛనుదారులకు రూ.4,000, కళ్యాణ లక్ష్మి తులం బంగారం సహా రూ.1,00,000 వంటి హామీలను మరిచిపోయారని కిరణ్ ధ్వజమెత్తారు. "రాజీవ్ యువ వికాసం" పేరుతో దరఖాస్తులు తీసుకుని నాలుగు నెలలుగా పట్టించుకోవడం లేదని, రూ.1 లక్ష నుంచి రూ.4 లక్షల వరకు ఉపాధి కల్పిస్తామన్న మాటలన్నీ మాయమయ్యాయని చెప్పారు.

**రెవెన్యూ, ఇసుక, నీటి విషయంలో ప్రభుత్వ వైఫల్యం**

జాజిరెడ్డిగూడెం వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్తులో ప్రమాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. తక్షణమే లారీ లవాదీలను ఆపి చెక్‌డ్యాం నిర్మించాలని డిమాండ్ చేశారు. అర్వపల్లి కేంద్రంలో బస్ షెల్టర్, మరుగుదొడ్లు, తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటు, సూర్యాపేట జిల్లాకు యూనివర్సిటీ, మండలాల్లో జూనియర్ కళాశాలలు, జాజిరెడ్డిగూడెంకు ఐఐటీ, పాలిటెక్నిక్, ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**'ఓట్ల కోసం డ్రామాలు కాదు- హామీల అమలు కావాలి'**

"ప్రజల ఆకాంక్షలకంటే ముందుగా డ్రామాలు చేసి ఓట్లు పడేయాలనే కోణంలో ప్రభుత్వం పావులు కదుపుతోంది" అని విమర్శించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి రేపు తిరుమలగిరి సభలో సమస్యల పరిష్కారానికి స్పష్టత ఇవ్వాలని కోరారు.

## బాన్సువాడ బోనాల మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర్ కాలనీలో దుర్గామాత ఆలయంవద్ద జరుగుతున్న బోనాల పండుగ సందర్భంగా ఆదివారం నాడు దుర్గామాతను దర్శించుకున్న ఏనుగు రవీందర్ రెడ్డి(మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ బాన్సువాడఇంచార్జ్)వారికిఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి శాలువాతో ఆలయ కమిటీ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మాసానిశేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్మంత్రిఅంజవ్వగణేష్ , ప్రతాప్ సింగ్ రాథోడ్, మాజీ ఏఎంసి చైర్మన్ పాత బాలకృష్ణ గుప్తా, మాజీ జెడ్పిటిసి కొత్తకొండ భాస్కర్, సీనియర్ నాయకులు మాసాని శ్రీనివాస్ రెడ్డి ,పట్లోళ్ల దేవేందర్ రెడ్డి, మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భాను గౌడ్, నందు పటేల్, పఠాన్ అంజాద్ ఖాన్, కార్పొరేటర్ బాడీ శ్రీనివాస్, డీసీ చైర్మన్ వెంకట్ రెడ్డి ,ఎస్సిసెల్ మండల అధ్యక్షుడు అంబర్ సింగ్, తారు నాయక్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా యూ త్ అధ్యక్షులు యూనిస్ ఖాన్, మాజీ సదర్స్ దడిగే హైమద్, సదర్ మహబూబ్, ఇబ్రహీంపేట అధ్యక్షులు బండి సాయిలు, రఫీక్ పార్టీకుటుంబ సభ్యులు, పాల్గొనడం జరిగింది.

## 27న మాలల ఆత్మీయ సమ్మేళనం..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మాల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘం తెలంగాణ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో తొలిసారిగా ఈనెల 27 తేదీన బాన్స్వాడ పట్టణంలో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖ మంత్రివర్యులు శ్రీ వివేక్ వెంకట స్వామి వస్తున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో ఉన్న మాలలు అధిక సంఖ్యలో హాజరై మాలల ఐక్యతను చాటి, కార్యక్రమంను విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం బాన్స్వాడ డివిజన్ అధ్యక్షులు మిర్జాపూర్ సాయన్న, మాల సంఘం సీనియర్ నాయకులు మల్లూరు సాయిలు,రాష్ట్ర కార్యదర్శి గౌడి నర్సింలు,కోటగిరి మాల సంఘం అధ్యక్షులు దండు భూమేష్,నస్రుల్లబాద్ మండల అధ్యక్షులు బాల సాయిలు, జుక్కల్ ఇంచార్జ్ జాతీయ మాలల ఐక్య వేదిక అధ్యక్షులు గైని ప్రవీణ్



కుమార్,పుప్పాల సైదయ్య, పాల గంగారాం,భైరపూర్ బేగరి గంగారాం, గున్న సాయిలు, బేగరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## నేరల్ తాండ లో ఘనంగా పసక జాతర

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి



గాంధారి మండలంలోని నేరల్ తాండాలో ఆదివారం పసక జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, శ్రీ లక్ష్మమ్మ దేవికి మేకపోతు బలిదానం ఇచ్చినట్లు, అలాగే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్‌కు సిరా నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. తాండాలోని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, సమయానికి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించినట్లు తాండావాసులు పేర్కొన్నారు.పూజల అనంతరం తాండావాసులందరూ కలిసి వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో తాండా నాయకులు చందా నాయక్, మాజీ వైస్ ఎంపీపీలు బస్సి దశరథ్ నాయక్, బిచ్చమ్ నాయక్, బస్సి చతుర్ సింగ్, ఉప సర్పంచ్ బస్సి నర్సింగ్, స్థానిక డైరెక్టర్ రాథోడ్ నెహ్రు, భగత్ నారాయణ, గోతి రాతిరామ్, రాము ఫోటో గ్రాఫర్, ఇతర తాండా నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధారిలో పెద్దపులి కలకలం

**కాయితీ తాండలో ఆవు పై దాడి.. గ్రామస్తుల ఆందోళన**

టైమ్స్ ఆఫ్ వార్త -గాంధారి

గాంధారి మండలం కాయితీ తాండ శివారులో పెద్దపులి దాడి స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ దాడిలో ఓ ఆవుకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కాయితీ తాండ శివారులో ఆవులపై పెద్దపులి దాడి చేసిందని, దీంతో ఆవు తీవ్రంగా గాయపడిందని గ్రామస్థులు పేర్కొన్నారు. పెద్దపులి సంచారంతో గ్రామంలో ప్రజలు భయపడుతున్నారని, పొలాలకు వెళ్లాలంటేనే భయమేస్తోందని తెలిపారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పెద్దపులిని పట్టుకోవాలని, ప్రజల భయాందోళనలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





## నర్సాపూర్ అటవీ సంరక్షణకు వారధి సంస్థ కృషి

టైమ్స్ ఆఫ్ వార్త-గాంధారి



గాంధారి మండలం నర్సాపూర్ శివారు అటవీ ప్రాంతంలో అటవీ సంరక్షణకు వారధి స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. సంస్థ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో అడవులను పరిరక్షించాలనే లక్ష్యంతో విత్తన బంతులను వెదజల్లారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, అటవీశాఖ సహకారంతో జంతువులకు అవసరమైన అనేక ఆహార ఉత్పత్తులను తమ సంస్థ తయారు చేసిందని తెలిపారు. వాటిని అడవిలో వెదజల్లుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బందితో పాటు సేవా సంస్థ సిబ్బంది కూడా పాల్గొన్నారు. అడవులను పరిరక్షించడంలో మరియు వన్యప్రాణులకు అవసరమైన ఆహారాన్ని అందించడంలో వారధి సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో విలువైనది ఆయన తెలిపారు

## ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులు బొట్టు మోతిరంకు సన్మానం

టైమ్స్ ఆఫ్ వార్త-గాంధారి



గాంధారి మండల ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన అధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి లను సోమారం తండా నాయక్ జైరాం నాయక్, కార్బారి మోతిరం నాయక్ ఆధ్వర్యంలో , గాంధారి మండలం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన అధ్యక్షులు బొట్టు మొత్తిరం నాయక్ మరియు సంయుక్త కార్యదర్శి దేవులను సోమవారం తండావాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోతిరాం నాయక్.. మాట్లాడుతూ బంజారా జాతి అభివృద్ధి కోసం ఎల్లవేళలా పాటుపడతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ , సిపిఐ జిల్లా నాయకులు మోతిరం, సీనియర్ అసిస్టెంట్ అమర్ సింగ్ ,పోలీస్ రమేష్, పోలీస్ సర్దార్, పోలీస్ రతన్ , ఆర్మీ ప్రవీణ్,సొసైటీ డైరెక్టర్ సంతోష్ ,సోమరం తండా ప్రజలు, యూత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో బోనమెత్తిన పోచారం శ్రీనివాస్ రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని సంగమేశ్వర కాలనీలో ఆషాఢ మాసం బోనాల పండుగలో సతీసమేతంగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి - పుష్ప , పోచారం శంభు రెడ్డి - ప్రేమల , మాజీ డీసీసీబీ ఛైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి , పోచారం సురేందర్ రెడ్డి , కాసుల రోహిత్ . ఈ బోనాల పండుగ ఉత్సవాలలో బాన్సువాడ పట్టణ నాయకులు ప్రజా ప్రతినిదులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన వస్త్రాధారణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల్ వర్ని సిసిడి ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు, టీచర్ శివరామకృష్ణ రమాదేవి లమనుమని మనుమరాలి నూతన వస్త్రాధారణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు, బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు.

టైమ్స్ ఆఫ్ వార్త
since: 2007
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
సోమవారం,
14-07-2025


# బోనమెత్తిన లష్కర్

(మొదటి పేజీ తరువాయి)..

యాదవ్, చామకూరు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, టీపీసీసీ ఉపాధ్యక్షులు కోట నీలిమ, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్, పలువురు హైకోర్టు జడ్జీలు, షిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, మహిళా కమిషన్ చైర్మెన్ నేరెళ్ల శారద, ఆర్యవైశ్య కమిషన్ కాల్వ సుజాత అమ్మవారిని దర్శిం చుకున్నారు. అలాగే అమ్మవారిని దర్శించు కున్న వారిలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు. బోనాల జాతరను పురస్కరించుకొని దేవాదాయ శాఖాధికారులు భక్తులకు కావాల్సి న ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకు నేందుకు సాధారణ భక్తులకు మూడు క్యూలైన్లు, బోనాల సమర్పించే మహిళలకు రెండు క్యూలైన్లు, వీఐపీలకు ఒక క్యూలైన్ ఏర్పాటు చేశారు. మొత్తం ఆరు క్యూలైన్ల ద్వారా భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని రోడ్ల నుంచి ఇతర మార్గాల వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రధానంగా పోలీస్ అధికారులు జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రయత్నించినప్పటికీ.. కొందరి అత్యుత్సాహం



కారణంగా భక్తులు, మీడియా ప్రతినిధులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇక జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న భవిష్యవాణి(రంగం) కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

## నేరడలో శ్రీ గుర్జుమైసమ్మ తల్లి బోనాలు..



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

మండల పరిధిలోని నేరడ గ్రామంలో ఆషాడ మాసంలో జరుపుకునే బోనాలు గత ఐదు సంవత్సరాల నుంచి శ్రీ గుర్జుమైసమ్మ తల్లి బోనాలు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుపుకుంటూ ఈ సంవత్సరం కూడా గ్రామంలో మహిళలు బోనాలతో పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ దూసరి గోపాలరావు, మట్టా రవి షేక్ దస్తగిరి బండి నాగేష్ మట్టా నరేష్ పగిళ్లపల్లి శంకర్ పగిళ్లపల్లి ఉప్పల్ పగిళ్లపల్లి కోటి సాయి గన్నారపు అప్పారావు షేక్ మదర్ తదితరులున్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన రాష్ట్ర మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

చింతకాని మండలం చిన్నమండవ గ్రామ మాజీ ఉపసర్పంచ్ పర్సగాని వీరబాబు మను మరాళ్లు ఓణీల అలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ .ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పెండ్యాల పుల్లయ్య, కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు,రైతు నాయకులు మంకెన రమేష్, లాయర్ లక్ష్మీనారాయణ,ఆళ్ల పానకాల రావు తదితర పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.



# ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా

### డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ

టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని

చింతకాని మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ పక్కన ఇందిర మహిళ శక్తి సంబరాలు పురస్కరించుకుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, డ్వాక్రా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం రేపు జరుగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్, ప్రణాళిక శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మధిర ఎమ్మెల్యే భట్టి పేదల ఇళ్ల కలను నిజం చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం పునఃప్రారంభం ద్వారా పేదలకు సొంతింటి ఆశ నెరవేరుతోంది. ఇది ప్రజా ప్రభుత్వం విజయపథంలో నడుస్తున్న నిదర్శనం" అని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ మండల నాయకులు, జోన్ ఇన్చార్జులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్



కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడిపల్లి భాస్కర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, మండల కాంగ్రెస్ బందెల నాగార్జున, ఓర్స్ వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ నాయకులు కిలారు మనోహర్ బాబు, జిల్లా మైనార్టీ నాయకులు ఎస్కే కాసిం, మండల సేవదళ్ అధ్యక్షులు పర్చగాని సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్ తాండలో ఘనంగా పసక జాతర

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి/వర్ని



వర్ని మండలంలోని సిద్దాపూర్ తాండ లో ఆదివారం పసక జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, శ్రీ లక్ష్మమ్మ దేవికి మేకపోతు బలిదానం ఇచ్చినట్లు, అలాగే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్‌కు సిరా నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. తాండాలోని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, సమయానికి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించినట్లు తాండావాసులు పేర్కొన్నారు.పూజల అనంతరం తాండావాసులందరూ కలిసి వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో తాండ పెద్ద ఛత్రు నాయక్, కన్నా నాయక్, గలయి జైతు, మాజీ సర్పంచ్ బర్వ్యాల్ గజిరామ్ నాయక్, దుమ్య బర్యానాయక్,భరద్వాల్ బాల్ సింగ్,బర్యా నాయక్, మాజీ ఎంపిటిసి కిషన్ నాయక్,5 వ వార్డ్ మెంబర్ భామన్ కిషన్, భామన్ సూరత్ రామ్,తాండా నాయకులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు పులిహెూర ప్రసాద వితరణ

### అయ్యప్ప నిత్య అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో వెలసిన శ్రీ కనకదుర్గమాత ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా శ్రీశ్రీశ్రీ అయ్యప్ప నిత్యా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాదం పులిహెూర పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టుకు దుర్గామాత ఆలయ కమిటీ, భక్తులు, కృతజ్ఞతలు తెలిపారు.

# బాన్సువాడ బోనమెత్తిన కాసుల రోహిత్

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ నియోజకవర్గం బాన్సువాడ పట్టణ కేంద్రంలో గౌలిగూడలో ఆశాడమాస బోనాల పండుగలో పాల్గొన్న బాన్సువాడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కాసుల రోహిత్ బాన్సువాడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ మన్సూర్ , హజారే శంకర్ , గౌలి గంగాధర్, వెంకట్ రావు ,రమేష్ ,శివ కులపెద్దలు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. స్వయంగా బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్న కాసుల రోహిత్ వారితోపాటు అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గుడి ప్రాంగణంలో కాసుల రోహిత్ చెట్లు పంపిణీ చేసి నాటడం జరిగింది.



# జాగృతి వర్సెస్ తీన్మార్..

(మొదటి పేజీ తరువాయి)..

గాయాలయ్యాయి. సాయిని రామ్ నగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయి స్తున్నారు. చేతి నుంచి బుల్లెట్ వెళ్లినట్లు వైద్యులు గుర్తించి చికిత్స చేస్తు న్నారు. కాల్పుల జరగడంతో క్యూ న్యూస్ కార్యాలయం రక్తసిక్తంగా మారింది. జాగృతి కార్యకర్తల దాడి, కాల్పుల నేపథ్యంలో మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న మల్కాజ్‌గిరి డిసిపి పద్మజా, ఎసిపి చక్రపాణి, మేడిపల్లి ఇన్స్‌స్పెక్టర్ సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేశారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

### బిసి ఉద్యమాన్ని ఆపలేరుః ఎమ్మెల్సీ నవీన్

క్యూ న్యూస్ ఆఫీస్ పై దాడి ఘటనపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మీడియాతో మాట్లాడుతూ హత్యాయత్నాలతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ఇలాంటి దాడులకు మల్లన్న భయపడుతాడు అనుకుంటే అది మీ భ్రమే అవుతుందని విమర్శించారు. విధుల్లో ఉన్న తన గన్‌మెన్ తుపాకీ లాక్కొని క్యూ న్యూస్ సిబ్బందిపై దాడి చేశారని తెలిపారు. కల్వకుంట్ల కవిత,ఆమె కుటుంబం తమపై హత్యాయత్నానికి పాల్పడిందని, ఇక ఊరుకోం.. మీరో,మేమో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. కంచం -మంచం అనేది తెలంగాణలో ఊతపదం.. నేను చేసిన వ్యాఖ్యలకు ఇంకా



కట్టుబడే ఉన్నానని స్పష్టం చేశారు. రౌడీల్లా తమపై దాడి చేయడమే కాకుండా మళ్లీ నామీదే కేసు పెట్టారని తెలిపారు.

# సుదర్శన్ గౌడ్ జన్మదిన వేడుకలు పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



మాజీ శాసనసభ్యులు బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది.

# డివిజన్ ర్యాంకర్ ఇందును అభినందించిన ఎమ్మెల్యే పోచారం

### 957 మార్కులతో మెరిసిన మద్దెలచెరువు బాలిక

టైమ్స్ ఆఫ్ వార్త-బాన్సువాడ



ఇంటర్మీడియట్ బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 957 మార్కులతో డివిజన్ స్థాయిలో ర్యాంకర్‌గా నిలిచిన మద్దెలచెరువు గ్రామానికి చెందిన గైని ఇందును రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అభినదించారు. ఇందు బాన్సువాడ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో చదువుకుంది. ఆమె ఈ ఘనత సాధించడం పట్ల ఎమ్మెల్యే పోచారం హర్షం వ్యక్తం చేస్తూ "ఇందు లాంటి విద్యార్థులు మా జిల్లాకు గర్వకారణం. మంచి చదువులతో ఉన్నత స్థాయికి ఎదగాలి" అని ఆశీర్వదించారు. ఇందు, కామారెడ్డి జిల్లా అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు గైని రవి కుమార్తె కావడం విశేషం. ఆమె ఈ విజయంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆకలి అందరిదీ గ్రూప్ సేవలు ప్రశంసనీయం.

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని



ఆకలి అందరిదీ గ్రూప్ చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని నాగిలిగొండ గ్రామ మాజీ సర్పంచ్ చాట్లసురేష్ అభివర్ణించారు.నాగిలిగొండ గ్రామానికి చెందిన మార్కపూడి కోటేశ్వరరావు గత కొంత కాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయిన విషయం గ్రూప్ దృష్టికి రాగా వారు స్పందించి ఆదివారం నాడు గ్రూప్ తరపున 3 నెలలకు సరిపడ నిత్యావసర సరుకులను వారి చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసుమారు గత 6 సంవత్సరాలుగా గ్రూప్ సభ్యులు నిరాశ్రేయులకు,దీనావస్థలో వున్న వారికి సహాయం అందించడం శ్లాఘనీయం అని పేర్కొన్నారు. అదే విధంగా గ్రూప్ ద్వారా సభ్యులు భవిష్యత్తులో దిన దినం ప్రవర్ధమానమయి మరింత మందికి తమ యొక్క సహాయ సహకారాలను,సేవలను అందించాలని అభిలషించారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# శభాష్ అనిపించుకున్న ఎస్ఐ, ఏఎస్ఐ

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని



చింతకాని మండలం జగన్నాధపురం సమీపంలో తుమ్మలమ్మ వాగు వద్ద రోడ్డు ప్రమాదం. ఖమ్మానికి చెందిన సుగుణ అనే మహిళకు తీవ్ర గాయాలు.తక్షణం స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన ఎస్ఐ నాగుల్ మీరా,ఏ ఎస్సై లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# రైలు బోగీల్లో నిఘా నేత్రాలు




న్యూఢిల్లీ: ప్రయాణికుల భద్రతలో భారతీయ రైల్వే తన వేగం పెంచింది. రైలు డోర్ల వద్ద సిసిటీవీల ఏర్పాటుకు కీలక నిర్ణయం తీసుకున్నా రు. దొంగలు, జులాయిలు ఎక్కువగా మహిళల మెడల్లో నుంచి నగలు, బ్యాగులు లాక్కుని వెళ తున్న వైనం గుర్తించి నివారణకు చర్యలు చేపట్టారు. బోగీకి ఉండే రెండు డోర్లకు ఒకొక్కటి చొ ప్పున వీటిని నెలకొల్పుతారు. భద్రతా చర్యల్లో భాగంగా మొత్తం 74వేల కోచ్‌లకు సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సంబంధిత ఏర్పాటుకు ఆమోదం తెలిపారని రైల్వే అధికారులు ప్రకటన వెలువరించారు. ప్రయాణికుల కదలికలను, ప్రత్యేకం గా అనుమానాస్పద వ్యక్తుల సంచారాన్ని పసిగట్టేందుకు, నేరాలు జరిగినప్పుడు నేరస్తులను పట్టుకునేందుకు ఈ కెమెరాలు ఉపయోగపడు తాయి. ప్రయాణికుల మాదిరిగా లోపలికి చేరే దుండగులు, ముఠాలను గుర్తించేందుకు సకాలంలో నివారణ చర్యలకు ఈ కెమెరాలతో వీలేర్పడుతుందని అధికారి ఒకరు తెలిపారు. నార్తర్న్ రైల్వే లోకో ఇంజిన్లు, కోచ్‌లకు ఇప్పుడు ప్రయోగాత్మక రీతిలో అమర్చిన సిసిటీవీ కెమెరాల ఏర్పాట్లు విజయవంతం అయిన దశలో మొత్తం బోగీలకు ఈ ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. వంద కిలోమీటర్ల వేగంతో సాగే రైళ్లలో కూడా దుండగుల ముఖాలు స్పష్టంగా కనబడేలా సరైన దృశ్యీకరణ ఉండే కెమెరాలను ఏర్పాటు చేస్తారని అధికారులు తెలిపారు. వెలుతురు తక్కువ ఉండే సమయంలో కూడా ఈ సిసిటీవీ కెమెరాలు శక్తివంతంగానే పనిచేస్తాయి. ఇక కెమెరాల ఏర్పాటు ద్వారా లభ్యం అయ్యే డాటాతో సక్రమ సత్వర రీతిలో నేరాలను చేదించేందుకు, నేరగాళ్లను పట్టుకునేందుకు అవసరం అయిన రీతిలో ఏఐ పరిజ్ఞానం వాడుకోవాలని రైల్వే మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. కేవలం డోర్ల వద్ద సిసిటీవీల ఏర్పాట్లు వల్ల లోపల ప్రయాణికుల గోప్యతకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. కేవలం గేట్ల వద్ద దుండగులను అదుపులో పెట్టేందుకు ఇవి ఉ పయోగపడుతాయని వెల్లడించారు.


## కాల్పులు విరమించండి

### టెల్ అవీవ్‌లో భారీ నిరసన

### గాజాలో చిన్నారుల మరణాలపై మౌన ప్రదర్శన

టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అంతర్జాతీయ సమాజం నుంచే కాదు.. స్వంత దేశంలో కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. గాజాపై ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమానికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌లోని టెల్‌అవీవ్‌లో ప్రజలు ఆందోళనలు చేశారు. ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల కారణంగా గాజాలో మరణించిన చిన్నారుల కోసం వారు మౌన ప్రదర్శనను నిర్వహించారు. మరణాల సంఖ్య పెరుగుతున్నందున కాల్పులను విరమించాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దాడులలో చనిపోయిన పిల్లల పట్ల నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లకార్డులను చేతబట్టుకొని నిరసనను తెలియజేశారు. ఈ ఆందోళనల్లో మహిళలతో పాటు వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. కాల్పులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో శనివారం 31 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని పాలస్తీనా అధికారులు చెప్పారు. ఇజ్రాయిల్ వైమానికదాడుల్లో 28 మందికి పైనా చనిపోయారనీ, ఇందులో నలుగురు చిన్నారులూ ఉన్నారని తెలిపారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి 57,762 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇందులో సగం మందికి పైగా చిన్నారులు, మహిళలే ఉన్నట్టు వివరించింది. 2023, అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయిల్ తీవ్రంగా విరుచుకుపడుతున్నది. హమాస్ టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నామని చెప్తూనే.. సామాన్య ప్రజలపై విరుచుకుప డుతున్నది. చిన్నారులు, మహిళలు, పౌరులు అనే తేడా లేకుండా కాల్పులు, డ్రోన్లతో యుద్ధోన్మాన్ని ప్రదర్శిస్తోంది. వీటికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇజ్రాయిల్ తీరును అంతర్జాతీయ సమాజం, పౌర సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. అయి నా.. ఇజ్రాయిల్ తీరు మారలేదు. అమెరికా మద్దతుతో ఒక్క గాజా మీదనే కాకుండా ఇతర దేశాలపై యుద్ధాలకు దిగుతున్నదని మేధావులు ఆందోళనను వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ జరుపుతోన్న యుద్ధానికి వ్యతిరేకంగా ఆ దేశంలో గతంలోనూ ఆందోళనలు జరిగాయి. యుద్ధానికి ముగింపు పలకాలంటూ మేలో వేలాది మంది ఆందోళనకారులు ఆ దేశ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుద్ధాన్ని కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తీరు పట్ల వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "ఇజ్రాయిల్‌కు నిజమైన శత్రువు హమాస్ కాదు.. ప్రజాస్వామ్య దేశాన్ని నాశనం చేస్తున్న ప్రధాని బెంజమిన్ నెతన్యాహునే.." అని ఆందోళనకారులు చెప్పారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం నెతన్యాహు ఈ యుద్ధాన్ని ఇంకా సాగిస్తున్నారని తెలిపారు. గాజాలో తమ ఆపరేషన్‌లను మరింత విస్తరిస్తామని ఇజ్రాయిల్ అధికారులు చెప్తున్నారు. ఈ చర్యలను మాత్రం బందీల కుటుంబీకులు, ఇజ్రాయిల్‌లోని పౌర సమాజం అంగీకరించటంలేదు. నెతన్యాహు తన చర్యలతో బందీలను బలిచేస్తున్నారని ఇజ్రాయిల్ ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# భాయ్.. బచ్చా ఆగయా



గంజాయి సరఫరా చేసే భారీ రాకెట్‌ను ఈగల్ టీం ఆపరేషన్ డెకాయ్ ద్వారా ఆదివారం చేదించింది. ఈగల్ ఎస్పీ సీహెచ్. రూపేష్, డీఎస్పీ సి.హరిశ్చంద్ర రెడ్డి, సిఐ పి.రమేష్ రెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. వీరి కథనం ప్రకారం గంజాయి సరఫరా చే స్తున్న మహారాష్ట్రకు చెందిన నిందితుడు సందీప్‌ను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో సందీప్ ఫోన్ స్వాధీనం చేసుకున్న అధికారులు అందులో ఉన్న ఫోన్ నెంబర్ల ఆధారంగా ఆదివా రం ఆపరేషన్ డెకాయ్ చేపట్టింది. తమ ఆపరేషన్ వివరాలను ఈగల్ టీం ఆపరేషన్ డెకాయ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలో నిషేదిత గంజాయి సరఫరా, విక్రయానికి పాల్పడుతోన్న నేరస్థుడు సందీప్ గురించి తమ కు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అం దిందని పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన ఈ వ్య క్తి గచ్చిబౌలిలోని సైబరాబాద్ బ్రాంచ్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సమీపంలో తరచుగా సంచరిస్తూ అక్రమ మాదకద్రవ్యాల అమ్మకాలను నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు.ప్రధానంగా ఐటీ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, కార్మికులను లక్ష్యంగా చేసుకుని ఈ దందా సాగించినట్టు వివరించారు. గచ్చిబౌలి ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్న సమాచారంతో ఈగల్ టీం బృందం మారు వేషాలలో నిఘా పెట్టినట్టు పేర్కొన్నారు. ఈ బృందాలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, గచ్చిబౌలి ప్రాంతం చుట్టూ నిఘా పెట్టి డ్రగ్స్ అమ్మేవారిని. అలాగే వాటిని కొనుగోలు చేసేవారిని గుర్తించినట్టు పేర్కొన్నారు. తమ అదుపులో ఉన్న నిందితుడు సందీప్ సెల్ ఫోన్‌లో ఉన్న 100 మందికి పైగా వినియోగదారులకు మెసేజ్ పెట్టిన్నట్లు తెలిపారు. అందులో ఉన్న నెంబర్లకు కోడ్ భాషలో భాయ్ బచ్చా ఆగయా అంటూ వాట్సప్ లోకేషన్ పోస్ట్ చేయగా, మెసెజ్ పోస్ట్ చేసిన రెండు గంటల వ్యవధిలోనే గంజాయి కొనుగోలు చేయడానికి వినియోగదారులు వచ్చారన్నారు. కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తులను చూసి తమ ఈగల్ బృందం ఆశ్చర్య పోయిందని తెలిపారు. డెకాయ్ ఆపరేషన్‌లో భార్యాభర్తల జంట ఒకరు తమ 4 సంవత్సరాల కొడుకుతో కలిసి గంజాయి కొనడానికి వచ్చారని, వారికి పరీక్షలు నిర్వహించగా భర్తకు పాజిటివ్ వచ్చిందని తెలిపారు. అలాగే మరొక భార్యాభర్తల జంట కూడా గంజాయి కొనడానికి వచ్చిందని వారిలో భార్య తప్పించుకోవడానికి ప్రయత్నించినట్టు తెలిపారు. గంజాయి కొనడానికి వచ్చిన 14 మందికి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించగా వారందరికీ పాజిటీవ్ వచ్చినట్టు తెలిపారు.వారందరికి చికిత్స, పునరావాసం కోసం సర్టిఫైడ్ డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రధాన వ్యాపారిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాం పట్టుబడిన నిందితుడు సందీప్ మహారాష్ట్ర నుంచి 50 గ్రాముల బరువు కలిగిన 100 ప్యాకెట్లను తీసుకుని వచ్చి ఒక్కో ప్యాకెట్ రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సమయంలో పట్టుబడకుండా తప్పించుకున్న మహారాష్ట్రకు చెందిన మరోక వ్యక్తి సరఫరా నెట్ వర్క్‌ను గుర్తించడానికి సాంకేతిక బృందాలు వినియోగదారుల మొబైల్ ఫోన్‌ల నుంచి సేకరించిన వాట్సాప్ కమ్యూనికేషన్ లాగ్‌లు, ఫోన్ నంబర్‌లు, డిజిటల్ ఆధారాలను విశ్లేషిస్తున్నట్లు తెలిపారు. విస్తృత పంపిణీ, డిమాండ్ నెట్‌వర్క్‌ను వెలికి తీసేందుకు 100 కంటే ఎక్కువ మంది కస్టమర్ల డేటాబేస్‌ను పరిశీలిస్తున్నామన్నారు. సందీప్ ఫోన్‌లో గుర్తించిన 14 మంది విని యోగదారును అదుపులోకి తీసుకోగామిగిలిన 86 మందిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. 14 మంది నుంచి స్వాధీనం చేసుకున్న డేటాతో మాదక ద్రవ్య సరఫరా నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఐటీ కారిడార్, దాని చుట్టుపక్కల పరిసరాల్లో మాదకద్రవ్యాల పదార్థాల ఉనికిని తొలగించడానికి నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### పట్టుబడిన వినయోగదారులు వీరే

ఆపరేషన్ డెకాయ్‌లో 14 మందిని పట్టుకున్నామని వారిటో ఐటి ఉద్యోగులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, టెక్నీషియన్లు, ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, డెంటల్ టెక్నీషియన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న వారిలో నవీన్ (ఆన్‌లైన్ ట్రేడర్), అయుష్ (విద్యార్థి), నికిల్ (రేసింగ్ ఇంజనీర్), సింధూర (ఆర్కిటెక్చర్), హసన్ (ప్రాపర్టీ మేనేజర్), క్రాంతి (ఐటి ఎంప్లాయ్), అఖిల్ (డెంటల్ టెక్నీషియన్), శివ(బిజినెస్ రిలేషన్ షిప్ మేనేజర్), సందేశ్ (ఫ్రీలాన్స్ యాడ్ ఎజెన్సీ), సాయిరాజ్ (రియల్ ఎస్టేట్ ఎగ్జిక్యూటివ్), అఖిల్ (ట్రావెల్ ఎజెన్సీ), స్వామి (డ్రైవర్), తుషార్ (ఐటి ఎంప్లాయ్), అర్పిత్(ఐటి ఎంప్లాయ్) ఉన్నారని ఈగల్ పోలీసులు తెలిపారు.

## లక్ష్యం 193

### సుందర్ 4 వికెట్ల మాయాజాలం

### రాణించిన బుమ్రా, సిరాజ్

### ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 192/10



లండన్ : లార్డ్స్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇరు జట్లు సమవుజ్జీలుగా నిలువగా.. రెండో ఇన్నింగ్స్ షూటౌట్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ 192 పరుగులు చేసింది. పిచ్ బ్యాటింగ్‌కు కష్టసాధ్యంగా మారగా.. స్పిన్‌కు సైతం అనుకూలించటం మొదలెట్టింది. దీంతో వాషింగ్టన్ సుందర్ (4/22) ఇంగ్లాండ్ తోక కత్తిరించాడు. సుందర్ మాయజాలంతో ఇంగ్లాండ్ ఆఖరు 4 వికెట్లను 11 పరుగులకే కోల్పోయింది. 62.1 ఓవర్లలో ఆ జట్టు 192 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (40, 96 బంతుల్లో 1 ఫోర్), బెన్ స్టోక్స్ (33, 96 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. ఒలీ పోప్ (4), జేమీ స్మిత్ (8)లు స్వల్ప స్కోర్లకు నిష్క్రమించారు.

ఆ ఇద్దరు మెరిసినా : ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 192 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్లు జాక్ క్రాలీ (22), బెన్ డకెట్ (12) ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. ఫామ్‌లో ఉన్న ఒలీ పోప్ (4) సైతం తేలిపోయాడు. మహ్మద్ సిరాజ్ ఉదయం సెషన్ ఆరంభంలోనే ఈ ఇద్దరిని సాగనంపాడు. జాక్ క్రాలీని నితీశ్ అవుట్ చేయగా ఇంగ్లాండ్ 50/3తో నిలిచింది. ఈ దశలో జో రూట్ (40), హ్యారీ బ్రూక్ (23) నాల్గో వికెట్‌కు 41 బంతుల్లోనే 37 పరుగులు జోడించారు. ఆకాశ్ దీప్ మెరుపు వేగంతో బ్రూక్ వికెట్లను గిరాటేశాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (33)తో జతకలిసిన రూట్ ఐదో వికెట్‌కు 128 బంతుల్లో 67 పరుగులు జత చేశాడు. రూట్, స్టోక్స్ క్రీజులో ఉండగా ఇంగ్లాండ్ భారీ స్కోరు దిశగా సాగింది.

154/4తో నిలిచిన ఇంగ్లాండ్‌ను వాషింగ్టన్ సుందర్ కట్టడి చేశాడు. జో రూట్, బెన్ స్టోక్స్ సహా విధ్వంసకర బ్యాటర్ జెమీ స్మిత్ (8)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. సుందర్ మాయకు చివరి 4 వికెట్లకు 11 పరుగులకే చేజార్చుకున్న ఇంగ్లాండ్.. ఆఖరు ఆరు వికెట్లను 38 పరుగులకే కోల్పోయింది. టెయిలెండర్లలో క్రిస్ వోక్స్ (10) ఒక్కడే రెండెంకల స్కోరు అందుకున్నాడు. బ్రైడన్ కార్స్ (1), షోయబ్ బషీర్ (2)లు పేస్, స్పిన్‌కు దాసోహం అయ్యారు. పరుగుల వేట గగనమైన పిచ్‌పై భారత బౌలర్లు అంచనాలను అందుకున్నారు. 192 పరుగులకే ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేశారు. కానీ మన బౌలర్లు క్రమశిక్షణ పాటించలేదు. ఫలితంగా, 32 పరుగులను ఎక్స్‌ట్రాల రూపంలో ఇచ్చుకున్నారు. లార్డ్స్ టెస్టు ఫలితంలో ఈ ఎక్స్‌ట్రాలు కీలక పాత్ర పోషించే అవకాశం లేకపోలేదు!.

## కోటకు.. కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)..





మినిస్టర్ కాశయ్యగా తనదైన నటనతో ప్రేక్షకుల్ని అబ్బురపరచిన కోట తెలుగునాట ప్రతిభగల నటీనటులకు కొదవ లేదని వాదించిన సందర్భాలు కోకొల్లలు. మనవాళ్ళకి కాకుండా అర్హత లేని పరభాషా నటీనటులకు తెలుగుచిత్ర పరిశ్రమ అధిక ప్రాధాన్యం ఇవ్వడాన్ని తప్పుపడుతూ ఎన్నోసార్లు బహిరంగంగా చర్చించిన ఏకైక నటుడు కూడా కోటనే. కోట శ్రీనివాసరావుకు ఇద్దరు కూతుర్లు, కొడుకు ప్రసాద్ ఉన్నారు. అయితే కొన్నేళ్ళ క్రితం కొడుకు ప్రసాద్ ఓ ప్రమాదంలో చనిపోయారు. అప్పట్నుంచి మానసికంగా కోట బాగా కృంగిపోయారు. అయినప్పటికీ వెండితెరపై ఆ బాధని తెలియనీకుండా అలరించారు. కుటుంబ సభ్యులు, అభిమానుల కన్నీటి వీడ్కోలుతో కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం మహా ప్రస్థానంలో ముగిశాయి. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది.